తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# నాన్ ఆప్కాస్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి : సిఐటియు




నాయుడుపేట, డిసెంబర్ 26 ప్రభాతవార్త: నాన్ ఆప్కాస్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చెంగయ్య అన్నారు. శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నాయుడుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిటీ నియామకం చేయాలన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆఫ్కాస్ సిబ్బందికి నాన్ ఆఫ్కాస్ సిబ్బందికి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. నాన్ ఆప్కాస్ వారిని ఆఫ్కాస్‌లో చేర్చాలన్నారు. గత జూలై నెల సమ్మె కాలానికి వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. ఇందుకు సంబంధించిన జీవో వెంటనే ఇవ్వాలన్నారు. 2023 డిసెంబర్ 26వ తేదీ నుండి 2024 జనవరి 11వ తేదీ వరకు మున్సిపల్ కార్మికులు సమ్మె చేయడం జరిగిందన్నారు. 17 రోజుల సమ్మె సందర్భంగా ఆనాటి ప్రభుత్వంతో అనేక ఒప్పందాలు కుదిరాయన్నారు. రిటైర్మెంట్‌కి సంబంధించిన జీవో వెంటనే ఇవ్వాలని అన్నారు. ఎక్స్‌గ్రేషియా ఐదు లక్షల నుండి ఏడు లక్షలకు పెంచుతామని ఒప్పందం కుదిరిందని అన్నారు. జీవో మాత్రం ఇంతవరకు ఇవ్వలేదని వెంటనే జీవో జారీ చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు డిఏ బకాయిలు సరెండర్ లీవ్‌ల ఎన్కాష్మెంట్ మొదలగునవి ఇవ్వాలన్నారు.ఎన్ ఎమ్ ఆర్ లకు గత ఏడేళ్లుగా జీతాలు పెంచలేదన్నారు. గ్రాడ్యుటి చెల్లించాలని వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని అన్నారు. సిక్, డెత్, రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. చట్టబద్ధమైన సెలవులు,రక్షణ పరికరాలు ఇవ్వాలని అన్నారు. సిబ్బందిని పెంచాలని పనిభారం తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కాలేషా, సురేష్, వేణుగోపాల్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

రెండు వేల ఏళ్ల క్రితమే...

# అగ్ర దేశంగా భారత్

**-ప్రపంచానికి నాగరికత పరిచయం చేసిన...దేశం మనదే -రాముడిని మించిన పురుషోత్తముడు ఎవ్వరూ లేరు -భారతదేశం త్వరలోనే సూపర్ పవర్ కావడం ఖాయమని -ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**

తిరుపతి విద్య,డిసెంబర్ 26 ప్రభాతవార్త : తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభ సదస్సుకు సీఎం చంద్రబాబు శుక్రవారం హాజరయ్యారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో కలిసి సందర్శించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వివిధ యుద్ధ పరికరాల నమూనాలను సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సీఎం సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ మన భారతీయ విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు మరింత విస్తృత పరిచేందుకు భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ అద్భుతంగా కృషి చేస్తోంది. దక్షి ణ భారత దేశంలో ఏడవ భారతీయ విజ్ఞాన్ సమ్మేళనాన్ని తిరుపతిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పవిత్ర ప్రాంతమైన తిరుపతిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని, వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉంటాయన్నారు. అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్, స్పెయిన్, జర్మనీ, రష్యా, జపాన్ వంటి దేశాల్లో రెండు వేల ఏళ్ల క్రితం భారత దేశానికంటే ఎంతో వెనుకబడి ఉన్నాయని రెండు వేల ఏళ్ల క్రితం ప్రపంచంలోనే భారత దేశం 40 శాతం జీడీపీని కలిగి ఉండేదన్నారు. నాలెడ్జ్ ఎకానమీలో భారత్ ఎప్పుడూ సూపర్ పవర్ గానే ఉండేదని... కానీ విదేశీ పాలన, స్వాతంత్రం వచ్చాక మనం చేసుకున్న కొన్ని పాలసీల వల్ల దేశం ఇబ్బంది పడి, 2047 నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్1 స్థానంలో నిలుస్తుందని వ్యక్తం చేశారు. ప్రతి జంట ముగ్గురు పిల్లలు కనాలని మోహన్ భగవత్ చెబుతున్నారని, నేనూ అదే చెబుతున్నానన్నారు. ఇప్పుడు మన జనాభానే ఆస్తిగా మారి, కొన్ని దేశాలు వయోభారం సమస్యతో ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. భారతదేశం నెంబర్1 స్థానంలోకి వెళ్లనున్న సందర్భంలోనే పేద ధనిక మధ్య అంతరాలు తగ్గే వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఇదే సమయంలో దేశాన్ని ప్రపంచ దేశాల ముందు ప్రత్యేకంగా నిలబట్టేంది మన విలువలు, సంప్రదాయాలే అని, ఆ దిశగా మోహన్ భగవత్ కృషి చేస్తున్నారన్నారు. విలువలు, నైతికత వంటి అంశాలను పెంపొందించేందుకు మోహన్ భగవత్ గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారని, భారతదేశంలో అద్భుతమైన కుటుంబ వ్యవస్థ ఉందని తెలిపారు. మన పురాణ పురుషుల గొప్పదనాన్ని యువతకు తెలియచెప్పాలి అని ఆయన అన్నారు.

**ఏపీ అభివృద్ధి చెందేలా ప్రణాళికలు:**

ఏపీలో టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు చేపడుతున్నాం. క్వాంటం, ఏఐ వంటి వాటితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. త్వరలోనే ఏపీ నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నాం. టెలికాం సంస్కరణలతో కనెక్టివిటీ పెరిగింది. స్పేస్ సిటీ, డ్రోన్



తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభ సదస్సులో జ్యోతి ప్రజల్వన చేస్తున్న సిఎం చంద్రబాబునాయుడు,ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తదితరులు

సిటీ, ఎయిరో స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, మెడ్ టెక్ పార్క్ వంటి వాటిని ఏర్పాటు చేస్తున్నాం. గూగుల్ పెద్ద ఎత్తున పెట్టుబడులు విశాఖలో పెట్టబోతోంది. అలాగే ఇంకా చాలా కంపెనీలు ఏపీకి రాబోతున్నాయి. ప్రాంతాల వారీగా ఏయే రంగాల్లో అభివృద్ధి చేయవచ్చో ప్రణాళికలు వేసుకుని రూపొందించాం అని సీఎం వెల్లడించారు.

**పురాణాలు యువతకు బోధించాలి:**

స్పైడర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్ వంటివి కాకుండా మన పురాణాల గురించి యువతకు పిల్లలకు చెప్పాలని ముఖ్యమంత్రి కోరారు. హాలీవుడ్ సూపర్ హీరోల కంటే మన పురాణ పురుషులు గొప్ప వారిని,వారికి చరిత్రను వివరించాలని, సూపర్ మ్యాన్ కంటే మన హనుమంతుడు బలవంతుడని బ్యాట్ మ్యాన్,ఐరన్ మ్యాన్ కంటే మన అర్జునుడు గొప్ప యోధుడని వివరించాలని, మన కృష్ణుని మహిమలు, శివుడి మహత్యం గురించి యువతకు బోధించాలని వివరించారు. రాముడిని మించిన పురుషోత్తముడు ప్రపంచంలో ఎవ్వరూ లేరని, రామరాజ్యం గురించి వివరించాలి అవతార్ సినిమా కంటే మన భారత, రామాయణాలు గొప్పవని పిల్లలకు చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. దేశాభివృద్ధికి వాజ్ పేయి పునాదులు వేశారని, ఇప్పుడు ప్రధాని నరేంద్ర అద్భుతంగా అభివృద్ధి చేస్తూ, వినూత్న ఆలోచనలతో, కొత్త ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, రెవిన్యూ శాఖ మంత్రి






అనగాని సత్య ప్రసాద్, ప్రొఫెసర్ భారత్, డాక్టర్ సతీష్‌రెడ్డి,సంస్కృత విద్యాపీఠం కులపతి ప్రొ. జి. ఎస్. ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కొండెక్కిన...

# కోడి మాంసం, గ్రుడ్లు

**-లింగాపురం కోడి మాంసం కేజీ రూ.280 -బ్రాయిలర్ కోడి మాంసం కేజీ రూ.250 - రూ.5.50 నుండి రూ.7.10కి పెరిగిన కోడిగ్రుడ్డు ధర**

చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో ఫారం కోడి మాంసంతో పాటు గ్రుడ్డు ధరలు కొండెక్కాయి. జిల్లా వ్యాప్తంగా కోడి మాంసం కొట్టు యాజమానుల వ్యాపారం ప్రస్తుతం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. జిల్లాలో గతంలో ఎన్నడు లేని విధంగా లింగాపురం కోడి మాంసం కేజీ రూ.280 వరకు చేరగా, బ్రాయిలర్ కోడి మాంసం ధర కేజీ రూ.250కు చేరింది. జిల్లాలో బ్రాయిరల్, లేయర్ కోళ్ళకు సంబంధించి స్వామి, సెంథిల్, ఎస్సార్, విహెచ్ఎల్, విఎస్ఎన్, సిపి తదితర ఇంటిగ్రేటెడ్ కంపెనీలు వున్నాయి. ఈ కంపెనీలు తమ హేచరీల్లో బ్రాయిలర్, లేయర్ కోళ్ళ పిల్లలను ఉత్పత్తి చేసి క్షేత్ర స్థాయిలో రైతులు నిర్వహించే కోళ్ళ ఫారాలకు కోడి పిల్లలను సరఫరా చేస్తాయి. కోళ్ళ ఫారాలు నిర్వహించే రైతులు కమీషన్ పద్ధతిపై బ్రాయిలర్ కోళ్ళను 45 రోజుల పాటు మేపి మళ్ళీ కంపెనీలకు ఇస్తారు. అలాగే గ్రుడ్లు పెట్టే లేయర్ కోళ్ళను ఆరు నెలలకు పైగానే కోళ్ళ ఫారాల రైతులు పెంచి పోషించి ఆ కోళ్ళ ద్వారా ఉత్పత్తి అయ్యే గ్రుడ్లను మార్కెట్‌కు తరలించి డబ్బులు చేసుకుంటారు. ఇంటిగ్రేటెడ్ కంపెనీలు కోళ్ళ ఫారం రైతులకు కోడి పిల్లలతో పాటు వాటిని పెంచి పెద్ద చేయడానికి అవసరమైన ఫీడ్, ఇతర ఆహారం, వైద్య సేవలు పక్కాగా అందిస్తుంటాయి. నాలుగు నెలల క్రితం వరకు లేయర్ కోడి ధర కేజీ రూ.90 మాత్రమే వుండేది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం లేయర్ కోడి ధర ఒక్కసారిగా కేజీ రూ.135కు చేరింది. లేయర్ కోడి ధర పెరగడంతో కోళ్ళ ఫారాల్లో గ్రుడ్లు పెట్టే లేయర్ కోళ్ళను సైతం కొంతమంది రైతులు ధర ఎక్కువ పలుకుతుందని భావించి కోళ్ళ ఫారాల నుండి ఖాళీ చేశారు. జిల్లా వ్యాప్తంగా వున్న లేయర్ కోళ్ళ ఫారాల్లో లేయర్ కోళ్ళు మాయం కావడంతో గ్రుడ్ల ఉత్పత్తి భారీగా తగ్గింది. దీంతో గ్రుడ్ల కొరత తీవ్రరూపం దాల్చింది. రెండు నెలల క్రితం వరకు ఒక కోడి గ్రుడ్డు ధర రూ.5.50 వుండగా ప్రస్తుతం ఒక కోడి గ్రుడ్డు ధర రూ.7.10కి చేరింది. జిల్లా వ్యాప్తంగా లేయర్ కోళ్ళ కొరత భారీగా వుండటంతో పెరిగిన కోడి గ్రుడ్డు ధర ఇప్పట్లో తగ్గే అవకాశం కన్పించడం లేదని హేచరీస్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే ఒక నెల రోజుల క్రితం వరకు బ్రాయిలర్ కోడి మాంసం ధర మార్కెట్‌లో కేజీ రూ.160కు లభ్యం అవుతుండగా లింగాపురం కోడి మాంసం ధర కేజీ రూ.190కి లభ్యం అయ్యేది. హేచరీస్‌లో కోళ్ళ పిల్లల ఉత్పత్తి తగ్గడం, హేచరీస్ ఇతర ప్రాంతాల నుండి కోడి పిల్లలను తెప్పించి రైతులకు పంపిణీ చేస్తుండటంతో కోడి పిల్లల ధర ఓ వైపు ఎక్కువ అయ్యింది. మరోవైపు మార్కెట్‌లో కోడి దాణా ధర అధికం కావడంతో హేచరీస్ సైతం బ్రాయిలర్ కోళ్ళ ధరలను పెంచేశాయని కోళ్ళ ఫారాల రైతులు పేర్కొంటున్నారు. అలాగే క్రైస్తవుల ముఖ్య పండుగ క్రిస్మస్ రావడం మరోవైపు జనవరి నెలలో సంక్రాంతి పండుగ వస్తుండటంతో ఇప్పట్లో బ్రాయిలర్ కోడి మాంసం ధర తగ్గే అవకాశం వుండదని కోళ్ళ ఫారాల రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లాలోని కోడి మాంసం విక్రయించే షాపుల్లో బ్రాయిలర్ కోడి మాసం రూ.250కు విక్రయిస్తుండగా లింగాపురం కోడి మాంసం కేజీ రూ.280కి లభ్యమవుతుంది. జిల్లాలో కొన్ని కోళ్ళ మాంసం విక్రయించే షాపుల్లో బ్రాయిలర్, లింగాపురం కోళ్ళ మాంసంతో పాటు నాటి కోడి మాంసంను విక్రయించేవారు. బ్రాయిలర్ కోడి మాంసం ధర కేజీ రూ.160 వుండే రోజుల్లో నాటి కోడి మాంసం కేజీ రూ.300కు లభ్యం అయ్యేది. ప్రస్తుతం బ్రాయిలర్ కోడి మాంసం కేజీ రూ.250, లింగాపురం కోడి మాంసం కేజీ రూ.280కు చేరడంతో నాటి కోడి మాంసం కేజీ రూ.450కి చేరింది. జిల్లాలోని హేచరీలు కోడి పిల్లల ధరలు తగ్గించే వరకు బ్రాయిలర్, లేయర్ కోళ్ళ మాంసం ధరలు ఆకాశంలో విహరించే అవకాశాలు వున్నాయని కోళ్ళ ఫారాల రైతులు పేర్కొంటున్నారు. అలాగే సమీపంలో సంక్రాంతి పండుగ వుండటంతో అప్పటి వరకు బ్రాయిలర్, లేయర్ కోడి మాంసం ధరలు ఇలాగే కొనసాగే అవకాశాలు వున్నాయని, అలాగే కోడి గ్రుడ్ల ధరలు సైతం సమీప భవిష్యత్తులో తగ్గే అవకావం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.



గంజాయి,డ్రగ్స్ నియంత్రణలో...

# తిరుపతి పోలీసులు భేష్!

**-భక్తులకు భద్రతాభావం కల్పించే బాధ్యత పోలీసులదే - రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**




నూతన పోలీస్ జిల్లా కార్యాలయం వద్ద సిఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత

తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి నెలకొన్న ఈ ప్రాంతం పవిత్రతను కాపాడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీసు వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా వుండాలని నిర్ధేశం చేశారు.భక్తులకు ఎక్కడా చిన్న అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశాలిచ్చారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన తిరుపతిజిల్లా పోలీసు కార్యాలయం (డిపిఓ)నూతన భవనాలను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీశ్‌కుమార్‌గుప్తా, అనంతపురం డిఐజి షిమోషి బాజ్‌పేయి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుతో కలసి సిఎం చంద్రబాబు నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. తిరుపతిలో గంజాయి,డ్రగ్స్ నియంత్రణకు కృషి చేస్తున్న పోలీసులనుసిఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఎర్రచందనం అక్రమరవాణా అరికట్టడంలోనూ, పిడి యాక్టుల అమలులోనూ పోలీసులు చూపుతున్న చొరవను ఆయన కొనియాడారు. అనంతరం నూతన డిపిఓ కార్యాలయంలో అన్ని గదులను సిఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి అనిత, డిపిజి హరీష్ కుమార్‌గుప్త, డిఐజి షిమోషి, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరచారి, శ్రీనివాసులు, డిఎస్పీలు, సిఐలు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎటు చూసినా భక్త జనమే

**-ఎక్కడ చూసినా వాహనాల పార్కింగే-తండోపతండాలుగా భక్తులు**



దక్షిణ గోపురం ఎదురుగా సెద తీరుతున్న భక్తులు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధి శనివారం కిట కిట లాడింది. వరుస సెలవులు, తిరుమలేశుని వైకుంఠ ఏకాదశి దర్శనాలకు వచ్చిన భక్త జనం సమీపంలోని కైలాసనాధుని దర్శనినాకి కదలి వచ్చారు. దాంతో శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయం ఇసుకేస్తేరాల నంత రద్దీ చోటు చేసుకుంది. పట్టణంలోని సన్నిధివీధి, దిగువ సన్నిధివీధి, టూరిస్టుబస్టాండు, స్వర్ణముఖి నది, శుకబ్రహ్మాశ్రమం రోడ్డు ఎటు చూసినా భక్తుల కార్లుతో కళ కళ లాడింది. ఇక సన్నిధివీధిలోని స్వామి వారి దర్శనానికి వెళ్లె నాల్గవ గేటు ప్రాంతం పలుమార్లు ట్రాఫిక్ స్థంభించిపోయింది.

**ఎక్కడ స్థలం ఉంటే అక్కడ కునుకు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన భక్తులు ఎక్కడ చోటు కనబడితే అక్కడ,ఎక్కవ షెల్టర్ ఉంటే అక్కడ కునుకు తీయటం కనబడింది.ముఖ్యంగా దక్షిణగోపురం ఎదురుగా ఉన్న భాగంలోనూ, పరిపాలనా భవనాలు ఎదురుగా భక్తులు సెద తీరటం కనబడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినాభక్తులే కావటంతో కొందరు దళారులకు పండగ వాతావరణం చోటు చేసుకుంది. అయితే కొందరు సెక్యూరిటి సిబ్బంది అర్చకులతో ఘర్షణ పడటం కనబడింది. అయితే స్వామి గర్భగుడి వద్ద ఆలయ ఇన్సెపెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం నాయుడు, హరికృష్ణ, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు చక్కగా పర్యవేక్షించారు.

**స్వర్ణకమలాలతో అమ్మవారికి అభిషేకం:**

శుక్రవారం కావటంతో ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి సాయంత్రం 'బంగారు పుష్పాలతో అభిషేకించారు.' అభిషేకాలను నిరంజన్ గురుకుల్ నిర్వహించారు. సాయంత్రం అభిషేకాలకు మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. అధిక శాతం భక్తులు కర్నాటకకు చెందిన వారు కనబడ్డారు. వారిలో ఎక్కువ మంది సమీపంలోని దక్షిణ కాళీమాతా ఆలయానికి హాజరయ్యారు. అధికారులు అందించిన సమాచారం మేరకు పాతికవేల మంది దర్శించుకున్నట్లు తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్ళి తిరిగి వెళుతూ...

# రోడ్డు ప్రమాదంలో... ఇద్దరు దుర్మరణం

తవణంపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త: దైవ దర్శనానికి వెళ్ళి తిరిగి వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని తిరుపతి - బెంగుళూరు సిక్స్‌లేన్ రోడ్డు కె,పట్నం ఫైఓవర్ బ్రిడ్జిపై గురువారం సాయంత్రం జరిగింది. సంఘటనకు సంభదించి స్థానిక ఎస్సై డాక్టర్ నాయక్ కథనం మేరకు వివరాలిలావున్నాయి. సౌత్ బెంగుళూరుకు చెందిన ఉమేష్ తన కుటుంబసభ్యులు ఆరు మందితో కలసి కారులో తిరుమల దర్శనార్థం వెళ్ళారు. వారు గురువారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు సాయంత్రం 4 గంటలకు కె.పట్నం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై అతి వేగంగా వెళుతూ ముందు వెళుతున్న లారీని అధిగమించేందుకు ప్రయత్నిస్తూ లారీ వెనుక భాగంలో ఒక వైపు ఢీకొన్నాడు. దీనితో కారు అదుపు తప్పి పక్కనున్న డివైడర్‌ను ఢీకొని మూడు పల్టీలు కొటి ంది. దీనితో కారులో ప్రయాణిస్తున్న ఉమేష్ భార్య కోమల (40) తీవ్రగాయాకు గురై అక్కడిక్కిడే మృతి చెందింది. అలాగే కారులో ప్రయాణిస్తున్న ఉమేష్ కుమారుడు వర్ధన్ గౌడ్(11) అనే బాలుడు తీవ్రగాయాలకు గురయ్యాడు. ఇతన్ని 108 అంబులెన్స్ ద్వారా చిచిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మెరుగైన చికిత్స కోసం వేలూరు నెర్చి అస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈసంఘటనలో కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు స్వల్ప గాయాలయ్యాయి. ఉమేష్ అతి వేగంగా అజాగ్రత్తగా నడపడం వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు ఉమేష్ కుటుంబ సభ్యులు శరత్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డాక్టర్ నాయక్ తెలిపారు.



కారు ప్రమాదంలో మృతి చెందిన కోమల, వర్ధన్ గౌడ్‌లు



## సంజీవని ప్రాజెక్ట్ పటిష్ఠంగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్

**రామకుప్పం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో ప్రారంభించిన సంజీవని ప్రాజెక్టును పిహెచ్‌సిల్లో పటిష్ఠంగాఅమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పిహెచ్‌సిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఫార్మసిస్ట్‌పై ఆరోపణలు రావడంతో విధులకు సరిగ్గా హాజరు కావాలని ఆదేశించారు. అనంతరం టాటా



డిజిటల్ నెర్ ్వ సెంటర్ (డిఐఎన్‌సి) పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతంలో చెరువులు, కుంటలు నిండడంతో ఇసుక కొరత ఉందని నేతలు కలెక్టర్‌కు వివరించడంతో రే ంజర్‌తో చర్చించి అవకాశాలు పరిశీలించి చర్యల నిమిత్తం తహశీల్దార్ కౌలేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ గంగాదేవి పాల్గొన్నారు.

## రీసర్వేకు రైతులు సహకరించాలి : పార్వతి

**కాగతి(చౌడేపల్లి), డిసెంబర్ 26 ప్రభాతవార్త :** రైతులు భూముల రీసర్వేకు సహకరించాలని తహశీ ల్దార్ పార్వతి కోరారు. మండలంలోని పంచాయతీ కేంద్రం కాగతిలో భూముల రీసర్వేపై ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ వ్యాప్తంగా జనవరి 2నుంచి రైతులకు సంబంధించిన భూముల రీసర్వేను చేపడుతున్నారన్నారు. రెవిన్యూ అధికారులు మురళీకృష్ణ, దొరస్వామి, సురేంద్రనాయక్, రవి, రైతులు పాల్గొన్నారు.




## ఈ-పంట నమోదును వేగవంతం చేయాలి : ఎడిఎ

**చౌడేపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** రబీకి సంబంధించిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ అన్నారు. స్థానిక పరిపాలనా భవనంలో పుంగనూరు డివిజన్ స్థాయి రైతు సేవా సిబ్బందికి పలు అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పండించే ప్రతి పంటను ఈ-పంటలో నమోదు చేయాలన్నారు. వ్యవసాయాధికారులు మోహన్‌కుమార్, రాధ, జ్యోతమ్మ, లీలాకుమారి, ఎఈఓలు శివశంకర్, ఖాదర్‌వల్లి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## శాప్ ఛేర్మన్ రవినాయుడును కలసిన గువ్వల

**చౌడేపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** రాష్ట్ర శాప్ ఛేర్మన్ రవినాయుడును మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) కలిశారు. ఇటీవల నిర్వహించిన మండల అధ్యక్ష ఎన్నికల్లో ఐవిఆర్ఎస్ కాల్స్ నందు అత్యధిక మెజార్టీ సాధించి, ప్రజాధారణ పొంది అధ్యక్షుడుగా గువ్వల ఎన్నికయిన సందర్భంగా పుంగనూరు నియోజకవర్గ పరిశీలకుడు, శాప్ ఛేర్మన్ అనిమిని రవినాయుడును కలసి దుశ్శాలవాలతో సత్కరించారు.



## రేపు చౌడేపల్లిలో హిందూ సమ్మేళనం

**చౌడేపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌడేపల్లిలో ఈనెల 28న హిందూ సమ్మేళనం వుంటుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక కళ్యాణ గంగమ్మ ఆలయం సముదాయంలోని మైదానంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

## ఘనంగా వీర్ బాల్ దివాస్!

**తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్త:** తిరుపతిలో వీరబాల దివాస్‌ను బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు వారి గుడి ఉత్తర మాడవీధిలోని గురుద్వార్ ఆశ్రమాన్ని సందర్శించి, అక్కడ విద్యార్థులకు చిత్రలేఖనం పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం సిక్కుల దైవానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జోరవర్ సింగ్ ఫతేసింగ్ త్యాగాన్ని స్మరించారు. చిన్న వయసులోనే ధర్మం, సత్యం కోసం ప్రాణత్యాగం చేసిన వారి ధైర్యం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష రామకృష్ణ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, వీరబాల దివాస్ యువతలో ధైర్యం, దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించే ముఖ్యమైన దినమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష రామకృష్ణ బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు గుండాల గోపీనాథ్ బిజెపి నార్త్ మండల అధ్యక్షుడు లోక ప్రభాకర్ నాయుడు బిజెపి మాజీ మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి బిజెపి సీనియర్ నాయకులు జయంత్ కుమార్ భాస్కర్ రెడ్డి తొండమనాటి సుబ్రహ్మణ్యం చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు చిత్రప హనుమంతరావు గురుద్వార్ ఆశ్రమ నిర్వాహకులు జేపి దన్ సింగ్ వివేకానంద సింగ్ రాజేందర్ సింగ్ సోనీ భాయ్ రాధిక భాయ్ లలిత్ సింగ్ హరి గంగోత్రి భాయ్ పాల్గొన్నారు.



## బాలల నృత్యప్రదర్శనాలు అదుర్స్

**తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్త:** శ్రీకృష్ణనటరాజాలయం తిరుపతి నృత్య దర్శకుడు కొండారవి నేతృత్వంలో మహతి కళాక్షేత్రంలో బాకళాకారుల నృత్యప్రదర్శనాలు అద్భుతంగా సాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం మహతి కళాక్షేత్రంలో శాస్త్రీయ జానపద నృత్యాలు ఎంతో ఆహ్లాదంగా జరిగాయి. నృత్యోత్సవాల్లో పాల్గొన్న చిన్నారులందరికీ బాలపురస్కారాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈనాటి బాలకళాకారులే రేపటి ప్రతిభగల కళాకారులుగా ఎదుగుతారని, మన సంస్కృతి సంప్రదాయాలు ఈ నృత్యోత్సవాల ద్వారా ప్రేక్షకులకు తెలియజేస్తున్నారని తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ,కెఎన్ రాజ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ముని భాస్కర్‌రాజుకు ఘన సన్మానం

**విజయపురం, డిసెంబరు 26 ప్రభాతవార్త:** మండలంలోని ఇళ్ళత్తూరు గ్రామానికి చెందిన ముని భాస్కర్‌రాజు చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధిగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం ఆయన నివాసంలో మండల నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి ధనంజయ యాదవ్, మండల అధ్యక్షుడు రమేషరాజు, కోసలనగరం సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యం రాజు, పురుషోత్తం, ఆసాధి ప్రకాష్ యాదవ్, వరద రాజులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కోనేటి రాయునికి అన్న ప్రసాద పాత్రలు వితరణ

**గంగవరం, డిసెంబర్ 26 ,ప్రభాతవార్త :** మండలం లోని కీలపట్లలో వెలసిన శ్రీ కోనేటి రాయస్వామికి రూ.30 వేలు విలువైన అన్నప్రసాద తయ్యారీ పాత్రలు విరాళంగా అందజేశారు. పలమనేరుపట్టణానికి చెందిన రేచర్ల కుటుంబీకులు రాజశేఖర్ నాయుడు, రత్నమ్మ, విఘ్నేష్ అనే భక్తులు స్వామి వారి నిత్య ప్రసాద, పూజ కైంకర్యాలకు అవసరమున్న రూ.30 వేలు విలువ చేసే పాత్రలను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రమణకు కీలపట్ల ప్రభాకర్‌యాదవ్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌నాయుడు మాట్లాడుతూ భగవంతుని కోసం చేసే ప్రతి దానం మన జీవితానికి ఆశీర్వాదం అని, కోనేటిరాయస్వామి ఆశీస్సులు ఎల్లప్పుడు అందరికీ కలగాలని, దినదిన ప్రవర్తమానమై వెలుగుతున్న కోనేటిరాయస్వామి దర్శనార్థం భక్తులు వేలాదిగా తరలి వస్తున్నారని భక్తుల అన్నప్రసాద తయారీ కొరకు తన వంతు సాయంగా పాత్రలను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.



## త్వరితంగా కోర్టు కేసులు పరిష్కారం

– జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

**చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** కోర్టుల్లో పెండింగ్‌లో వున్న కేసుల పరిష్కరించడంపై తహసిల్దార్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ తహసిల్దార్లను ఆదేశించారు. జిల్లాలోని తహసిల్దార్లతో శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పిజిఆర్ఎస్, కోర్టు కేసులు, రిట్ పిటీషన్లు, ఆడిట్ నేరాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కోర్టుల్లో 118 కంటెంట్ కేసులు వున్నాయని, అలాగే 42 కేసులు పెండింగ్‌లో వున్నాయని, వీటికి సత్వరం కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని తహసిల్దార్లు, ఇందుకు సంబంధించిన రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## రైల్వే స్టేషన్ ఎదుట సిఎస్‌సిడిఎస్ ఆధ్వర్యంలో నిరసన

**చిత్తూరుహెల్త్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** చిత్తూరు నగర ప్రజలు ఎదుర్కొం టున్న రైల్వే సమస్యలపై శుక్రవారం చిత్తూరు రైల్వే స్టేషన్ ఎదుట చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఎస్‌సిడిఎస్ అధ్యక్షులు తాండవమూర్తి మాట్లాడుతూ చిత్తూరు నుండి చెన్నై వరకు డైరెక్టు రైలు నడపాలని, చిత్తూరు వైపు నుండి వెళ్తున్న ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్ళను చిత్తూరు రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని, కాట్పాడి-చిత్తూరు-పాకాల-తిరుపతి రైల్వే డబుల్‌లైన్ పనులు పూర్తి చేసి ఈ మార్గంలో వందే భారత్ ట్రైను వెళ్ళేలా ఏర్పాటు చేయాలని, మహావీర్ వంతెన కొత్తగా నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఎస్‌సిడిఎస్ నాయకులు గోపినాయక్, సత్య, చంద్రబాబు, మురళీ, కృష్ణసింగ్, లీలావతి, కుసుమ, సుమతి, రైతు నాయకులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రజెండా లేకుండా చేయడం ఎవరి తరం కాదు

– రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు

**చిత్తూరుహెల్త్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** దేశంలో ఉద్యమ చరిత్ర కల్గిన బారత కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా లేకుండా చేయడం ఎవరి తరం కాదని రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు అన్నారు. చిత్తూరు దొరస్వామి అయ్యంగార్ రోడ్డులోని అన్నా మైదానంలో శుక్రవారం సిపిఐ శతాబ్ది ఉత్సవసభకు రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భావించిందని, అప్పటి నుండి నేటి వరకు భూమి, భుక్తి, సమ సమాజం కోసం సిపిఐ అహర్నిశలు పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు, నాయకులు గోపినాథ్, బాలాజీరావు, రఘు, సత్యమూర్తి, విజయకుమార్, దేవయాని, జమిలాబీ, రమాదేవి, కుమారి, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.



## ఓంశక్తి ఆలయ కుంబాభిషేక మహోత్సవం

**పాలసముద్రం, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** మండలంలోని నిశింకాపురం గ్రామంలో వెలసిన ఓం శక్తి ఆలయంలో శుక్రవారం కుంబాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్, చిత్తూరు శాసనసభ్యుల గురజాల జగన్మోహన్, పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి చిట్టిబాబు, చిత్తూరు మేయర్ ఆముద, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ మండల పార్టీ అధ్యక్షులు శివ ,మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసు నాయుడు హాజరయ్యారు.



## తాగునీటి సమస్యకు పరిష్కారం

**సదుం, డిసెంబర్ 26 ప్రభాతవార్త** మండల పరిధిలో రెండు చోట్ల తాగునీటి సమస్య పరిష్కారమైంది సదుం మండలం అమ్మగారి పల్లి పంచాయతీలో రెండు చోట్ల తాగునీటి సమస్య ఉండేది. సీతమ్మ మరియు శివాలయం కొండపైకి గతంలో తాగు నీరు సౌకర్యం లేదు. మండల పర్యటనకు వచ్చిన పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విజ్ఞప్తి చేశారు. పంచాయతీ నిధుల ద్వారా శివాలయం వద్దకు అదేవిధంగా ఎస్టీ కాలనీకి పైప్ లైన్ వేసి తాగునీటిని అందించారు. ఈ కార్యక్రమం లో సింగల్ విండో మాజీ వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి , సర్పంచ్ వరలక్షి ్మ అమ్మగారి పల్లి ప్రజలు పాల్గొన్నారు.



## నేడు అయ్యప్ప పడికట్ల పూజలు

**సదుం డిసెంబర్ 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రతివారిపల్లె లో బురుజు కొండపై వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం పడిమెట్ల పూజలు నిర్వహిస్తున్నట్లు మేనేజర్ భాస్కర్ రాజు తెలిపారు ఇప్పటికే ఆలయాన్ని శుభ్రం చేసినట్లు చెప్పారు.

## పార్కు పక్కన కొత్త దుకాణాలు... రోడ్డుకై స్థల పరిశీలన

**కుప్పం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** కుప్పం పట్టణ నడిబొడ్డున గల జమీ ఒదారు పార్కు పక్కన ఉన్న రాజుకాలువ సమీపంలో కొత్తగా దుకాణాల నిర్మాణాలకు గాను ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ప్రస్తుతం ఉన్న రాజు కాలువ వెడల్పు ఇరవై అడుగులకు పెంచడంతో పాటు దానిపై సిమెంట్ రోడ్డు నిర్మాణంకు చర్యలు చేపట్టాలని కమీషనర్ శ్రీనివాసరావును ఆదేశించారు. కాలువ పక్కనుంచి రాధాకృష్ణరోడ్డు వరకు మున్సిపాలిటీకి చెందిన స్థలంలో నూతనంగా దుకాణాల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పార్కు స్థలం అలాగే ఉండాలని ఆదేశించారు. పార్కు దుకాణాల వ్యాపారులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఓ పక్క దుకాణాల నిర్మాణం, మరో పక్క సిసి రోడ్డు నిర్మాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు సోమశేఖర్, జిమ్‌దాము, జాకీర్, ఎ ంఆర్ సురేష్, కార్పోరేషన్‌డైరెక్టర్ వేణు, రెస్కో డైరెక్టర్ శివ, నేతలు ఆర్‌ఆర్ రవి, మంజు, అప్పి, నబీ, నాను, జాలు, లోకేష్, దేవా పాల్గొన్నారు



## అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వవిప్ తనిఖీ

**కుప్పం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** స్థానిక రామ చంద్రారోడ్‌లో ఉన్న మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలతో మాట్లాడారు. ఆహారం, కోడిగుడ్లు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలోమున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కమీషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్‌సోమశేఖర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.



## రైతులు ఎరువులను పరిమితంగా వాడాలి : ఎఎంసి ఛైర్మన్

**గుడుపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** రైతులు పంటలసాగులో ఎరువులను పరిమితంగా వాడాలని కుప్పం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు కోరారు. శుక్రవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ఉద్యానవన పంటలతో పాటు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. అలాగే వరిపంట బీమాకు ఈనెల 31వతేది చివరి తేది అన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ వింధ్య, కార్పోరేషన్ డైరెక్టర్ బాబు, మండల అధ్యక్షుడు సుబ్బు, రెస్కో డైరెక్టర్ అమీర్, సిల్క్‌బోర్డు సభ్యుడు హేమాంబర గౌడు, రైతులు పాల్గొన్నారు.



## పంటలపై ఆగని గజదాడులు

**రామకుప్పం, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** మండలం లోని ననియాల అటవీ సరిహద్దు ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న పంటలను జంట ఏనుగులు ధ ్వంసం చేస్తున్నాయి. గురువారం రాత్రి రాగి, వరి, నూర్పిడి అయిన పైరు, గి ంజలను తిన్నంత తిని మిగతా ధ్వంసం చేశాయి. చీకటి పడితే జంట ఏనుగులు ఏదో ఓ గ్రామ సమీపంలో పంటలపై పడుతున్నాయి. అటవీ అధికారులు,ట్రాకర్లు ఏనుగుల దారి మళ్లింపుకు చేపడుతున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సకాలంలో వినతుల పరిష్కారానికి కృషి

**చిత్తూరురూరల్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** ప్రజలు అందించిన వినతులను సకాలంలో పరిష్కరించాలని మేయర్ ఎస్ అముద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆదేశాలతో ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌నందు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఇంటిస్థలాలు, హౌసింగ్, పెన్షన్లు, ఉపాధి, భూసమస్యలపై పలువురు వినతి పత్రాలు అందించారు. వినతులను క్షేత్రస్థాయిలో విచారించి సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ వెంకటరామిరెడ్డి, గుడిపాల ఎంపిడివో శిరీష, డిప్యూటీ తహశీల్దారు విజయ్‌కృష్ణ, చిత్తూరురూరల్ ఏవో చంద్రశేఖర్, డిఈలు వెంకటరమణ, శ్రీధర్, తెదేపా నగర అధ్యక్షుడు నరేష్, పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే సమస్యలపై నిరసన

**చిత్తూరురూరల్, డిసెంబరు 26 ప్రభాతవవార్త:** చిత్తూరుపట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు రైల్వే సమస్యలపై చిత్తూరుస్మార్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు బుధవారం రైల్వేస్టేషన్ ఆవరణలో నిరసన వ్యక్తం చేసారు. అధ్యక్షుడు తాండవమూర్తి మాట్లాడుతూ చిత్తూరు నుంచి చెన్నైకి డైరెక్టుగా ట్రైన్ నడపాలనీ, అలాగే చిత్తూరు నుంచి వెళుతున్న 6 ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు ఆగాలనీ, కాట్పాడి చిత్తూరు పాకాల తిరుపతి మీదుగా రైల్వేడబుల్‌లైన్ పనులు పూర్తిచేసి వందేభారత్ ట్రైను నడపాలనీ, మహావీర్ వంతెన కొత్తగా నిర్మించి, ఆర్టీసి బస్టాండు, బిఎస్ఎన్ఎల్ ఆఫీసు నుంచి రైల్వేస్టేషన్‌కు దారి కల్పించాలని డిమాండ్ చేసారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రైల్వేస్టేషన్ మేనేజరు ముత్తుస్వామికి అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తాండవ మూర్తితో పాటు గోపినాయక్, సత్య చంద్రబాబు, మురళీ, కృష్ణసింగ్, జనార్ధన్, నాగరాజు, నాగేంద్ర, రషీద్, లీలావతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి పార్టీ కార్యాలయ కార్యదర్శికి సత్కారం

**చిత్తూరురూరల్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో వుంచుకొని తెలుగుదేశం పార్టీ అధిష్టానం జిల్లా. నియోజక వర్గాలవారిగా నూతన కార్యవర్గంను ప్రకటించింది. ఈ క్రమంలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శిగా నియమితులైన ఎన్ మోహన్‌రాజ్‌ను జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మేషక్, మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజా, గ్రామకమిటీ అధ్యక్షుల సురేష్ దుశ్శాలువతో సత్కరించారు.



## దారి తగాదా వల్ల టెంకాయ చెట్లను కోసేసిన దుండగులు

**బైరెడ్డిపల్లి,డిసెంబర్ 26 ప్రభాతవార్త :** బైరెడ్డిపల్లి మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన సంపంగి అనే రైతు యొక్క టెంకాయ చెట్లను కొంతమంది కోసి వేయడం జరిగిందని ఆ రైతు పోలీసు వారికి విన్నవించడం జరిగినది. నాగిరెడ్డిపల్లి నుండి మిట్టపల్లి మీదుగా బైరెడ్డిపల్లి కి వచ్చే దారిలో భాగంగా వచ్చినటువంటి ఈ తగాదా గత రెండు సంవత్సరాల నుండి జరుగుతున్నది. ఇది కాస్త పోలీస్ స్టేషన్లకు కోర్టులకు వెళ్లిన అనంతరం ఇప్పుడు కొబ్బరి చెట్లను కోసి వేసే వరకు వచ్చింది. కోర్టులో ఉన్న కారణం చేత దీనిపై స్టే ఆర్డర్ ఉన్నది. అయినా కానీ ఇలా చెట్లనుకోవడం దుర్మార్గమని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. సంబంధిత సబ్ ఇన్స్పెక్టర్ చందన ప్రియ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సుబ్రహ్మణ్యంరెడ్డికి వరించిన నామినేటెడ్ పదవి

**బైరెడ్డిపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** మండలం తెలుగుదేశం సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి చిత్తూరు జిల్లా తెలుగుదేశం ఆర్గనైజింగ్ సెక్రటరీగా పదివి రావడం జరిగినది. ఈ సందర్భంగా బైరెడ్డిపల్లి మండల నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం అధ్యక్షులు కిషోర్‌గౌడ్ ఇంటి వద్ద సమావేశమై ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ రెడ్డి, జైచంద్ర చారి, గోవిందస్వామి తదితర మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సహజ వ్యవసాయం చేస్తేనే మేలు

**పుంగనూరు రూరల్,డిసెంబర్ 26 ప్రభాతవార్త:** స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి ప్రకృతి సహజ పద్ధతు ల్లో వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉందని వ్యవసాయశాఖ ఏడీ శివకుమార్ సూచించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల నేల సారత తగ్గడం, పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం, మానవ ఆరోగ్యానికి హానికరం వంటి అనర్థాలు కలుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రకృతి సహజ వ్యవసాయ విధానాల వైపు మొగ్గు చూపాలని సూచించారు. శుక్రవారం పుంగనూరు పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి కన్వర్జెన్సీ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీ శివకుమార్ మాట్లాడుతూ, ప్రకృతి సహజ వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించడంతో పాటు నేల సారతను కాపాడుకోవచ్చని వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

**పుంగనూరు డిసెంబర్ 26 ప్రభాతవార్త:** పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిన్నట్లుస్తు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛైర్‌పర్సన్ అలీమ్ బాషా అధ్యక్షతన జరగ నున్న పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల సమస్యలు, పరిపాలనకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

**సోమల, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** పకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని డిఆర్‌డిఎ పీఎం శివ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ శివరత్నమ్మ మాట్లాడుతూ పకృతి వ్యవసాయంతో సాగుచేసిన ఆహార పదార్థాలను వాడడం వల్ల పలు రోగాలను నివారించవచ్చని ఆమె తెలిపారు. వ్యవసాయశాఖ ఏఈఓ మంజుల మాట్లాడుతూ పలు రకాల కషాయాలను ఇంటివద్ద రైతులు తయారు చేసుకుని వాడి చీడపీడలను నివారించవచ్చు అని తెలిపారు. ఎన్ఎఫ్ఏ ట్రైనర్ నాంచారమ్మ మాట్లాడుతూ మహిళా రైతులు ఆర్గానిక్ పంటలు ఎలా అమ్ముకోవాలో వివరించారు. కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ సిహెచ్ఓ అమర్నాథ్, వెలుగు సిసిలు వహీద్, గంగోజి, మునిరత్నం, వెలుగు సిబ్బంది జ్యోతి తదితరులు పాల్గొన్నారు

## నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యం : ఎమ్మెల్యే

**గంగాధర నెల్లూరు, డిసెంబరు 26 ప్రభాతవార్త:** నిరుద్యోగ నిర్మూలలే లక్ష్యం అని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వి.ఎం థామస్ అన్నారు. శుక్రవారం ఎన్ డిఆర్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ఆదికేశవరెడ్డితో కలసి గంగాధర నెల్లూరు ఎస్‌ఆర్‌పురం మండలాలలో పరిశ్రమల స్థాపనకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. అలాగే మరిన్ని కంపెనీలను తీసుకు వచ్చి గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతను ఉపాధి కల్పించి ముఖ్యమంత్రి ముందుకు వెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్ పెనుమూరు మార్కెట్ కమీటీ ఛైర్మెన్ కృష్ణమ నాయుడు శ్రీధర్ యాదవ్‌లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి : ఎమ్మెల్మే

***గంగాధర నెల్లూరు, డిసెంబరు 26 ప్రభాతవార్త:***

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే విఎం థామస్ అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన హాజరై ప్రజా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచన మాట్లాడుతూ ఈ వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌డిఇ ఆనంద్ రెడ్డి ఎంపిడిఓ మనోహర్ గౌడ్ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఇఓ ఆంజనేయులు శెట్టి, సిడిపిఓ పద్మ సుసంద మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, పెనుమూరు మార్కెట్‌కమిటీ అధ్యక్షులు కృష్ణమ నాయుడు శ్రీధర్‌యాదవ్, హరీష్ యాదవ్, కోదండరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధి పనులను పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్

**తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధికి సంబంధించిన పనులు



కార్యక్రమాలు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కల్లెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధి కార్యక్రమాల పై ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి మరియు సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వర్ణ నారావారి పల్లె అభివృద్ధిలో భాగంగా జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించి, నారావారిపల్లి అభివృద్ధికి సంబంధించిన పనులను సంక్రాతి లోపల త్వరితగతిన పనులు పూర్తి అయ్యేటట్లు చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులు ప్రసాద్ రావు, దశరథరామి రెడ్డి, ఐసిడిఎస్ పిడి వసంత బాయి, జిల్లా విద్యా శాఖ అధికారి కెవియన్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ కో ఆర్డినేటర్ లోకనాథం, సంబంధిత జిల్లా అధికారులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## సుబ్రమణ్యంస్వామి వారికి ప్రత్యేకపూజలు

**కార్వేటినగరం,డిసెంబరు 26 ప్రభాతవార్త:** కార్వేటినగరం స్కంధపుష్కరిణి సమీపంలోని కొమరగిరి గుట్టపై వెలసియున్న శ్రీవళ్ళిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి వార్లకు శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉభయదాతలైన విజయపురం వాస్తవ్యులు పుష్పావతి,నరేష్ కుటుంబసభ్యులు స్వామివారికి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ ఉభయదారులను సత్కంరించారు.



## అల్లాహ్‌మెచ్చే ముస్లింలు కావాలి:రేహాన్

శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త:



నేడు సమాజంలో ఇస్లాం మత సిద్దాంతాలను తమ ఇష్టానుసారం మలు చుకుంటున్నామని అయితే అల్లాహ్ మెచ్చే రీతిలో ప్రవక్తలు ఆచరించిన విధానాలతో మనం అల్లాహ్‌కు ప్రీతి పాత్రులు కావాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ వివరించారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ఆయన ప్రత్యేక ప్రార్ధనల సందర్బంగా ముస్లింలకు వివరిస్తూ నేడు మనం సమాజం చూడటానికి ప్రార్ధనలు చేస్తున్నామని ఈ విధానం మారాలన్నారు. అల్లాహ్ ఆదేశాలను ఆచరించాలని భక్తి శ్రద్దలతో ప్రార్ధనలు చేసి అల్లాహ్ కరుణను పొందాలని వివరించారు. షరియత్‌ను మన ఇష్టప్రకారం వాడుకోరాదన్నారు. సమాజాన్ని ఆకట్టుకోవటానికి పరితపిస్తూ అల్లాహ్ ఆగ్రహానికి గురౌతున్నారన్నారు. సమాజంలో పరిస్థితిని బట్టి మన వేష భాషలు మారుతున్నాయని మారాలన్నారు. చిత్తశుద్దితో మనం అల్లాహ్‌ను శరణుజొచ్చి వేడుకుంటే తప్పక మన ప్రార్ధనలు ఆమోదించి వరాలిస్తాడనే సత్యాన్ని గుర్తించాలని రేహాన్ పిలుపు నిచ్చారు.

## శివయ్య సేవలో పంజాబ్ హైకోర్టు జస్టిస్

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తీశ్వరాలయానికి శుక్రవారం పంజాబ్ హర్యాన హైకోర్టు జడ్జి జస్టిస్ వీరేందర్ అగర్వాల్ కుటుంబసమేతంగా వాయులింగేశ్వరుని దర్శించుకొని పూజలుజరుపుకున్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఓ మోహన్,పర్యవేక్షకులునాగభూషణం యాదవ్, కోర్టు సిబ్బంది ఆలయ మర్యా దలతో వేదపండితులతోస్వాగతం పలికారు.

## గొబ్బెమ్మ పుర ప్రదర్శన

శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తిలో శుక్రవారం అమ్మవారు గొబ్బెమ్మగా పుర ప్రజలకు దర్శనమిచ్చారు.ధనుర్మాసంలో అమ్మవారు గౌరమ్మగా దర్శనమివ్వటం ఆనవాయితీ.ఈ నేపద్యంలో శుక్రవారం అలంకార మండపంలో ప్రత్యేకంగా అలంకరించి బోయిలు మోసుకుంటూ శివయ్యగోపురం,రాజగోపురం నుంచి వాహనాలమండపం వద్దకు చేర్చారు. అక్కడ ప్రత్యేక పూజలు జరిపి రుద్రాక్షల పల్లకిలో ప్రతిష్టించి ఊరేగింపు జరిపారు. ఆలయాధికారులు వెంటరాగా అమ్మవారు నాలుగుమాడావీధుల్లో దర్శనమిచ్చారు.ఇంటింటి వద్ద హారతులిచ్చారు.

## ఘనంగా గంధం మెరవాణి

శ్రీకాళహస్తి డిసెంబర్ 26 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి సువర్ణముఖి నది తీరాన వెలసిన హజరత్ జులేషాపీర్ దర్గా భక్తులకు కొంగుబంగారంగా వరాలు జల్లుతున్న గంథంత్సోవం కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిధిగా సినిమా హీరో సుమన్‌గౌడ్ హజరైయ్యారు.ప్రతి ఏడాది జరిగే ఈ ఉత్సవం ఈ సారి సినిహీరో సుమన్‌గౌడ్ గంధం మెరవాణితో కలిసి పట్టణంలోని నాలుగుమాడవీధులో ఊరేగింపులో పాల్గొన్నారు.బళ్లారి నుంచి మేళాతాళాలతో,నౌరంగబజాలతో ఫకీర్ జబ్బర్లతో సయ్యద్‌సర్వరుద్దీన్ ఇంటి నుంచి గంధంను దర్గానిర్వాహకులు సయ్యద్ అహ్మద్ దర్గాలో స్వామి వారి వద్ద ప్రతిష్టించి పూజచేసి పట్టణంలో ఊరేగింపుగా తీసుకెళ్తారు.అందులో భాగంగా 25 న జెండా ప్రతిష్ట 26 న గంధం మెరవాణి 27 ఖవ్వాలి తహ్‌లీల్ ఫాతెహా జరుగుతుందని దర్గా నిర్వాహకులు బాబా ఫరీద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో దర్గా కమిటి మెంబర్లు ఒరుగంటి నాగేశ్వరరావు, గుమ్మల రాజేశ్వరరావు,ఎంఎస్ జమ్మద్‌బాషా,ఉదయ్‌భాస్కర్,గరికపాటి రమేష్‌బాబు, రాజేష్‌క్రిష్ణా, జమీల్‌బాషా,ఎంఎస్ అబ్దులా పాల్గొనగా వీరికి బందోబస్తును పోలీసులు చక్కగా ఏర్పాటు చేశారు.

## ఘనంగా మండలాధ్యక్షుల జన్మదిన వేడుకలు

తొట్టంబేడు డిసెంబర్ 26 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండలాధ్యక్షులు రావిళ్ళ మునిరాజ నాయుడు జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన నివాసంలో తొట్టంబేడు మండల విలేకరుల సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి దుశ్శాలువాలతో సత్కరించారు.అదే విధంగా సింగిల్ విండో చైర్మెన్ భీమాల భాస్కర్ ముదిరాజ్ దుశ్శాలువలు కప్పి పూల మాలలు వేసి ఘనంగా సత్కరించి సన్మానించారు.ఎంఎల్ఏ పిఏ బాలాజి, మీడియా సమన్వయకర్త నాగమల్లి దుర్గాప్రసాద్, వినయ్, తొట్టంబేడు మండల పార్టీ ప్ర ధానకార్యదర్శిసుబ్రమణ్యం, చందు, కమలాకర్‌నాయుడు, వాసునాయుడు, నెమళ్ళూరు. బుజ్జితదితరుల న్నారు.

## శివయ్యసేవలో ప్రెస్ అకాడమి చైర్మెన్

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శుక్రవారం ప్రెస్ అకాడమి చైర్మెన్ ఆలపాటి సురేష్‌బాబు కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎపిఆర్ఓ సుబ్రమణ్యం స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.పలువురు పాత్రికేయులు ఆయనకు స్వాగతం పలికారు.

## క్యూలైన్లలోనే నిరీక్షిస్తున్న భక్తులు

-సర్వదర్శనానికి 25 గంటలుపై గానే

తిరుమల,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:



వారాంతం రోజులు,వరుసగా నాలుగురోజులు సెలవులు కావడంతో దేశం నలుమూలల నుండి భక్తులు భారీగా తిరుమలకు చేరుకుంటున్నారు. శుక్రవారం ఉదయానికి వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్‌లు నండిపోయి శిలాతోరణం వరకు ఐదుకీలోమీటర్లు వెలుపలకు చేరాయి. వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. భారీగా భక్తులు తరలిరావడంతో నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. 26గంటలు సమయం కేటాయిస్తున్నారు. పెరిగిన విపరీత రద్దీతో తిరుమలలో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్దంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు.

## రసాయన శాస్త్ర అధ్యయనంతో అపార అవకాశాలు

తిరుపతి విద్య,డిసెంబర్ 26 ప్రభాతవార్త:



ఎస్ వి జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియట్ తర్వాత రసాయన శాస్త్రంతో అవకాశాలు అనే అంశంపై ప్రొఫెసర్ బి. జగన్ మోహన్ రెడ్డి, రసాయణశాస్త్ర విభాగాధిపతి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం, ప్రసంగిస్తూ, రసాయన శాస్త్రం ఒక సబ్జెక్ట్ గా చదివిన వారికి అపార అవకాశాలు ఉన్నాయన్నారు. రసాయన శాస్త్రంలో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఉన్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు అధ్యక్షత వహించగా, రసాయన సాస్త్ర అధ్యాపకులు, పి. ప్రియవర్ధన, విజయలక్ష్మి ్మ, డా. సి.ఎల్.చెన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం

తిరుపతి విద్య,డిసెంబర్ 26 ప్రభాతవార్త:



ఎస్‌విఆర్ట్స్ కళాశాలలో అన్నమయ్య సంకీర్తనలు-ఆధ్యాత్మికత అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ జాతీయ సదస్సును ఎస్.వి.ఆర్ట్స్ కాలేజీ తెలుగు విభాగం ఆధ్వర్యంలో విభాగాధిపతి డాక్టర్ ఎం.భీమన్న నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. సదస్సు ప్రారంభం సందర్భంగా అతిథులు, ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించారు.జాతీయ సదస్సుకు సంబంధించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.బెంగళూరు వర్సిటీ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు కె.ఆశాజ్యోతి అన్నమయ్య సంకీర్తనలలో వ్యక్తమయ్యే భక్తి, తత్వం, ఆధ్యాత్మిక భావనలు, సమాజంపై వాటి ప్రభావాన్ని ఆమె విస్తృతంగా వివరించారు ఎస్‌వియూ తెలుగు అధ్యయన శాఖ విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదర్ నాయుడు అన్నమయ్య కీర్తనల పరిశోధన ప్రాధాన్యతపై మాట్లాడారు.ఎస్.వి. ఈ జాతీయ సదస్సుకు వివిధ వర్సిటీలు, కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సాహిత్య వేత్తలు పాల్గొని అన్నమయ్య సంకీర్తనల ఆధ్యాత్మికతపై తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ సదస్సు ద్వారా అన్నమయ్య సాహిత్యానికి, ఆధ్యాత్మిక తత్వానికి సంబంధించిన పరిశోధనలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని నిర్వాహకులు డాక్టర్ ఎన్. భీమన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు,సాహిత్యులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి, కాలేజీ తెలుగు అధ్యాపకురాలు తేజోవాణి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు తప్పక వీక్షించాలి

- డీఈవో కె.వి.ఎన్ కుమార్

**తిరుపతి విద్య,డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



రాష్ట్రీయ సంస్కృత వర్సిటీ లో నిర్వహిస్తున్న భారతీయ విజ్ఞాన సమ్మేళన కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా, విశేష ఆకర్షణతో కొనసాగుతోందని డి ఈ ఓ కె.వి.ఎన్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయన స్వయంగా సందర్శించి,ఈ సమ్మేళనంలో శాస్త్ర-సాంకేతిక రంగాలకు సంబంధించిన ఆధునిక, వినూత్న ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇవి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచన, పరిశోధనాత్మక దృష్టిని మరింత పెంపొందించేలా ఉన్నాయని తెలిపారు. సిద్ధాంతాలను అనుభవాత్మకంగా అర్థం చేసుకునేలా ఈ ప్రదర్శనలు రూపుదిద్దుకున్నాయని కలెక్టర్ ఆదేశాల మేరకు తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్,రేణిగుంట, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల నుంచి ప్రతిరోజు 3000 మంది విద్యార్థులు, వారితోపాటు ఉపాధ్యాయులు,పెద్ద సంఖ్యలో ఈ ప్రదర్శనలను సందర్శించడానికి ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా, జిల్లాలోని మిగిలిన అన్ని మండలాల నుంచి వీలున్న ప్రతి ఒక్కరూ తప్పక విచ్చేసి ఈ శాస్త్ర-సాంకేతిక ప్రదర్శనలను వీక్షి ంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమ్మేళనం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తి పెరిగి, భవిష్యత్‌లో నూతన ఆవిష్కరణలకు ఇది బలమైన పునాదిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మేళనాన్ని ప్రత్యక్షంగా సందర్శించిన వారిలో తిరుపతి జిల్లా విద్యాశాఖ ఐటీ సెల్ ఇంచార్జి ధనుంజయ నాయుడు,తిరుపతి మండల విద్యాశాఖ అధికారి బాలాజీ,సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి గారు సత్యవేడు హామీ నెరవేర్చండి : సీపీఎం

**సత్యవేడు, డిసెంబరు 26 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్యవేడు ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీని తక్షనం నెరవేర్చాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు సత్యవేడు బహిరంగ సభకు విచ్చేసినప్పుడు సత్యవేడును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తానని సుమారు పదివేల మంది ఓటర్ల సమక్షంలో హామీ ఇవ్వడం జరిగిందని ఆయన వెల్లడించారు. సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, కేవీబీ పురం, బుచ్చి నాయుడు కండ్రిగ, వరదయ్యపాళెం, నారాయణవనం మండలాలు సత్యవేడు నియోజకవర్గం పరిధిలోకి ఉన్నాయి. అయితే పై మండలాలను ఇష్టానుసారంగా చించి వేసినట్లు పలు డివిజన్ కేంద్రాలకు చేర్చడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక భూ సమస్యలతో కూరుకుపోయిన సత్యవేడు బాగు పడాలంటే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చర్యలు తీసుకోవాల్సిందేనని, ఆ మేరకు అధికారమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని చంద్రబాబు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ విషయంపై టీడీపీ నాయకులు, ప్రభుత్వం నేటి వరకు ఒక్క అడుగు ముందుకు వేయలేదని జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీసిటీ ఉన్నప్పటికీ సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో అభివృద్ధి అంతంత మాత్రమేనని అన్ని కోణాల్లో ఆలోచించి ముఖ్యమంత్రి చంద్రబాబు సత్యవేడుకు న్యాయం చేయాలని జనార్ధన్ డిమాండ్ చేశారు.

## వికసిత్ భారత్‌పై వ్యాసరచన పోటీలు

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 26 ప్రభాతవార్త:



వీర బాల దివస్ సందర్భంగా వికసిత్ భారత్ రూపకల్పనలో విద్యార్థులు పాత్ర, భేటి బచావో భేటి పడావో అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో వ్యాసరచన రాస్తున్న విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ పరిశీలించి, ప్రతి బిడ్డలో సృజనాత్మకతను, ఆత్మ విశ్వాసాన్ని, దేశ నిర్మాణం పట్ల నిబద్ధతను ప్రేరేపించాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, దాసు, జగన్నాథం, రమేష్, ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాదెండ్ల మురళి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో టూరిస్ట్ బస్సు డ్రైవర్ మృతి!

రేణిగుంట డిసెంబర్ 26 ప్రభాతవార్త:



పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై రేణిగుంట మండలం మల్లవరం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మధుసూదన్ (70) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా బీట్ మార్కెట్ నుండి ఇల్లందుల మధుసూదన్ ట్రావెల్స్ బస్సును యాత్రికులతో తిరుమలకు తీసుకువస్తున్నాడు. బస్సు రేణిగుంట మండలం ఆర్ మల్లవరం గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఏ 2ఎస్ లాడ్జి వద్ద బస్సును ఆపి హోటల్లో బస్సులోని ప్రయాణికుల కోసం రూములను మాట్లాడారు. అనంతరం ఆయన రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. రేణిగుంట అర్బన్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి శుక్రవారం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## రాస్‌చే మహిళా రైతులకు శిక్షణ

రేణిగుంట డిసెంబర్ 26 ప్రభాతవార్త:



మండలం చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిత్తూరు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ సహకారంతో కరకంబాడి గ్రామ నందు మహిళా రైతులకు సాధికారతపై శుక్రవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. శాస్త్రవేత్త దివ్య సుధ మాట్లాడు తూ మహిళలు వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందాలన్నారు.మహిళా రైతులకు కాయ కూరల పెంపకం, పచ్చళ్ళ తయారీలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పుట్టగొడుగుల పెంపకం కూడా మహిళలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గృహవిజ్ఞాన శాస్త్రవేత్త దివ్య సుధ, రాస్ కోఆర్డినేటర్ రమేష్ రెడ్డి, భారతి, రాస్ సిబ్బంది మహిళా రైతులు పాల్గొన్నారు

# తిరుపతి డివిజన్

## భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ పోరాట ప్రస్థానం

**పుత్తూరు రూరల్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** పుత్తూరు డివిజన్ సమితి ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణం అంబేద్కర్ సర్కిల్‌లో సీపీఐ జెండా ఆవిష్కరణ కృష్ణారెడ్డి సీనియర్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ పుత్తూరు మండల కార్యదర్శి జి.మహేష్ మాట్లాడుతూ 1925లో స్థాపితమైన భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ), వందేళ్ల పూర్తి చేసుకున్న సీపీఐ, సమానత్వం, న్యాయం, సెక్యులరిజం లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రబాబు, కృష్ణారెడ్డి, రమణ, రవి, వెంకటముని, గంగాధరం, చంద్ర, తిరుమలయ్య, సులవర్ధన్, బాలాజీ, చిన్నబ్బ, రాజు తదితరులు పాల్గొన్నారు.



## వందేళ్ళ సీపీఐ పోరాటం అజరామరం

**బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 26 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ 101వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను బుచ్చినాయుడు కండ్రిగలో ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముందుగా బస్టాండ్ వద్ద ఉన్న సీపీఐ పతాకాన్ని మండల కార్యదర్శి ధర్మయ్య ఆవిష్కరించి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సం గ్రామంలో దేశ ప్రజలను ఏకతాటిపై నడిపి అన్ని వర్గాల ప్రజలను స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా ఉత్తేజపరచిన భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్యం లక్ష్యంగా పోరాటాలు నడిపిందని అన్నారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గంతో పాటు ప్రజలందరూ సంఘటితమై ముందుకు నడవాల్సిన అవసరం ఉందన్నారు.



## శ్రీశక్తి పీఠంలో హీరో సుమన్

**రామచంద్రాపురం, డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠాన్ని శుక్రవారం ప్రముఖ సినీ నటుడు సుమన్ సందర్శించారు. పీఠానికి చేరుకున్న ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీఠం ఆవరణలో వెలసియున్న శ్వేత వారాహిదేవి, శ్రీమరకతశక్తి కాళీదేవికి, శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ముడుపులు కట్టారు. శక్తి పీఠం కార్యదర్శి శ్రీకాంత్ పీఠం విశిష్టత, దేవతామూర్తుల విశిష్టతలను వివరించారు. అనంతరం పీఠాధిపతులు సిద్దేశ్వరనందభారతి మహాస్వామి, మంత్ర మహేశ్వరీ రమ్యానంద భారతి ఆయనను ఆశీర్వదించి, తీర్ధప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశక్తి పీఠం ప్రతినిధి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ జనబాట కార్యక్రమం

**సత్యవేడు, డిసెంబరు 26 ప్రభాతవార్త:**



సత్యవేడులో శుక్రవారం నిర్వహించిన కరెంటోళ్ళ జనబాటలో సంబంధిత విద్యుత్‌శాఖ సిబ్బంది పలు సమస్యలను గుర్తించారు. తిరుపతి విద్యుత్‌శాఖ సీఎండీ ఆదేశాల మేరకు వారంలో ప్రతి మంగళ, శుక్రవారాలలో కరెంటోళ్ళ జనబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే శుక్రవారం స్థానిక విద్యుత్‌శాఖ ఏఈ వాసుదేవయ్య ఆధ్వర్యంలో సబ్ ఇంజనీర్ రవి, లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు, లైన్‌మెన్లు శేఖర్, మురగయ్య తదితరులు పట్టణంలోని కోటమిట్ట, రామ్‌నగర్, నేతాజీ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, శ్రీకాళహస్తి మార్గాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ నేపథ్యంలో కోటమిట్ట కాలనీలో దెబ్బతిన్న మూడు విద్యుత్ స్తంభాలను గుర్తించారు. కరెంటోళ్ళ జనబాట కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఆర్డీఓ, డిఎస్‌పి కార్యాలయాలను ఏర్పాటు చేయండి



-రాష్ట్ర సిఎంకి ఎమ్మెల్యే వినతి

**నారాయణవనం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలను కలుపు తూ సత్యవేడులో ఆర్డీఓ కార్యాలయం, పోలీసుశాఖకు సంబందించి డిఎస్పీ కార్యాలయంను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వినతిపత్రం అందించి కోరారు. శుక్రవారం తిరుపతి పర్యాటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబును కలిసి తన వినతిపత్రాన్ని అందించారు. దీనివల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాగే కెవిబిపురం మండలంలో పేద ప్రజల కోసం టిటిడి కళ్యాణ మండపాన్ని నిర్మస్తే ఎంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. అంతకుముందు సిఎం చంద్రబాబును పుష్పగుచ్చం అందించి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే ఇచ్చిన వినతిపత్రానికి సిఎం సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

## ఊంజల్‌సేవలో భక్తులకు అమ్మవారి దర్శనం

నారాయణవనం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామి వారిని తిరుప్పావై ప్రవచనంతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు.

## ఆయుర్వేద డాక్టర్ల హర్షం

తిరుపతి హెల్త్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:




కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సెంట్రల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ ఆమెడమెంట్ రెగ్యులేషన్ 2020 ప్రకారం ఆయుర్వేద శల్య, శాలాక్య పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వైద్యులకు 58 శాస్త్ర చికిత్సలకు అవకాశం కల్పించినందుకు ఆయుర్వేద డాక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా యూనిట్ సభ్యులు శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు,అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ రవికుమార్, డాక్టర్ జోష్నా, డాక్టర్ రిషిక శర్మ, డాక్టర్ కార్తీక్ పాల్గొన్నారు.

## విశిష్ట అవార్డు గ్రహీత కె.విచౌదరికి సత్కరణ

తిరుపతి విద్య,డిసెంబర్ 26 ప్రభాత వార్త :



గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు చేతులు మీదుగా విశిష్ట అవార్డు అందుకున్న ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె.వి చౌదరిని తిరుపతిలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు ఆయనను సత్కరించారు. ప్రజా డైరీ మాసపత్రిక 25సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్బంగా ఆయనకు విశిష్ట అవార్డు రావడం జరిగింది. బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సమితి కన్వీనర్ కుప్పల గిరిధర్ మాట్లాడుతూ బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులైన కె.వి చౌదరి ఈ అవార్డు రావడం పట్ల తమకెంతో గర్వకారణమని అన్నారు. కెవి చౌదరిని శాలువా వేసి, సత్కరించడం జరిగింది. ఈకార్యక్రమంలో, ఎమ్.వేణుగోపాల్ రెడ్డి ఫిల్మ్ సొసైటీ చైర్మన్, ప్రసిడెంట్ వై. ఎస్ బాబు బుజ్జి బాబు నాయుడు ,వైయస్ రాజు పాల్గొన్నారు.

